
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 41.1 । కనిష్ఠం 27.5

నిజామాబాద్
జిల్లా వార్తలు

శుక్రవారం 10 మే 2024

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం


కోటగిరి, మే 9: మండలంలోని మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ బాలుర కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ మొబిన్ తెలిపారు. మైనార్టీలకు 60సీట్లు, ఎస్సీలకు 4, ఎస్టీలకు 4, ఓసీలకు 2, బీసీలకు 10సీట్లు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెలాఖరులోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

"కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి ఒక ప్రణాళిక, అభివృద్ధిపై విజన్ ఉంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే రాష్ట్రంలో అభివృద్ధి జరిగింది. పదేళ్ల బీజేపీ పాలనలో రాష్ట్రానికి, పార్లమెంట్ నియోజకవర్గానికి ఒరిగిందేమీ లేదు. కనీసం మూతపడ్డ పరిశ్రమలను కూడా తెరిపించలేదు. ప్రజలపై పన్నుల రూపంలో భారం వేసి బడా కార్పొరేట్ కంపెనీలకు లాభం చేశారే తప్ప.. సామాన్య జనానికి చేసిందేమీ లేదు. ఎంపీ ఎన్నికలు అత్యంత కీలకం.. ప్రజలు ఆదరించి గెలిపిస్తే నిజామాబాద్ పార్లమెంట్ ముఖ స్వరూపాన్ని మార్చి మరింత అభివృద్ధి చేస్తాం" అంటూ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డి గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. రాష్ట్రంలో అధికారంలో కాంగ్రెస్ ఉండటం వల్ల అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని, ప్రజలు అన్ని ఆలోచించి ఈ ఎన్నికల్లో నిర్ణయం తీసుకోవాలని కోరారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నిజామాబాద్

కాంగ్రెస్‌కు విజన్, ప్రణాళిక ఉంది



- పేదల సంక్షేమానికే ఇన్నేళ్లుగా కృషి చేస్తోంది
- కేంద్రంలో పదేళ్లు బీజేపీ అధికారంలో ఉన్నా.. ఒక్క ప్రాజెక్టు జిల్లాకు రాలేదు
- నిజాంషుగర్ ఫ్యాక్టరీలను తెరిపించేందుకు కాంగ్రెస్ చిత్తశుద్ధితో కృషి చేస్తుంది
- గల్ఫ్, బీడీ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి: ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, మంత్రిగా పనిచేసిన మీరు పార్లమెంట్ ఎన్నికల్లో ఏ ఎజెండాతో ఎంపీగా పోటీ చేస్తున్నారు.

జీవన్‌రెడ్డి: నా నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజా సమస్యల పరిష్కారంలో ముందున్నాను. రైతాంగానికి అండగా ఉన్నాను. రైతు సమస్యలపై పోరాటాలు నిర్వహించాను. ఎమ్మెల్యేగా వారి కోసం ఎన్నో అభివృద్ధి పనులు చేశాను. రైతుల సంక్షేమమే ఎజెండాగా పనిచేశాను. రాష్ట్ర మంత్రిగా ఉన్న సమయంలో అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చాను. రోడ్లు, సంక్షేమ పథకాలు అమలయ్యే విధంగా చూశాను. ఎమ్మెల్సీగా కూడా సమస్యలపై ఎప్పుడూ శాసన మండలితో పాటు బయట గళమెత్తాను.

ఆంధ్రజ్యోతి: ఈ ఎన్నికల్లో ఏ అంశాలు మీకు అనుకూలిస్తాయని భావిస్తున్నారు?

జీవన్‌రెడ్డి: పార్టీ ఆదేశాలకు అనుగుణంగా ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాను. రైతులు, గల్ఫ్ కార్మికులు, బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు పార్లమెంట్ వేదికగా ఉంటుందని భావించాను. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటం కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వచ్చే అవకాశం ఉండటంతో ఎంపీగా గెలిస్తే అన్ని సమస్యలను పరిష్కరించే విధంగా పనిచేస్తామన్న ఎజెండాతో ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాను.

ఆంధ్రజ్యోతి: నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఈ పదేళ్లలో అభివృద్ధి జరగలేదని భావిస్తున్నారా?

జీవన్‌రెడ్డి: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి జరిగింది. ఈ పదేళ్లు కేంద్రంలో మోదీ అధికారంలో ఉన్నారు. కనీసం మూతపడిన చక్కెర కర్మాగారాలను తెరిపించలేదు. పసుపు బోర్డు ఏర్పాటు హామీ పూర్తిగా నెరవేర్చలేదు. రైతాంగ సమస్యలను పరిష్కరించలేదు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా ఇక్కడి ఎంపీ ఒక్క పరిశ్రమను తీసుకరాలేదు. ఆర్మూర్, ఆదిలాబాద్, బోధన్, బీదర్ రైల్వే లైన్‌ల కోసం ఇక్కడి ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నా పట్టించుకోలేదు. పదేళ్లలో రైల్వేకు సంబంధించి ఏ ఒక్క ప్రాజెక్టు కూడా జిల్లాకు రాలేదు.

ఆంధ్రజ్యోతి: ఎన్నికల హామీలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటును ప్రకటించిందని అనుకుంటున్నారా?

జీవన్‌రెడ్డి: గత ఎన్నికల సమయంలో బీజేపీ ఎంపీ వారం రోజుల్లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఐదేళ్ల తర్వాత మళ్లీ ప్రధాని మోదీ ప్రకటన చేశారు. పసుపుబోర్డును ఏర్పాటు మాత్రం చేయలేదు. ఎన్నికల హామీల్లో భాగంగానే కేంద్ర హోంమంత్రి నిజామాబాద్‌లో ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ఈ బోర్డు ప్రకటన తీసుకువచ్చారు. పసుపు బోర్డు ఏర్పాటు కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుంది.

ఆంధ్రజ్యోతి: ఎన్నికల్లో గెలవగానే నిజాంషుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని బీజేపీ ప్రకటించగా, రాష్ట్రంలో కాంగ్రెస్ నిధులు విడుదల చేసింది. రెండు పార్టీలు ఎన్నికల హామీలో భాగంగానే ప్రకటన చేశాయా?

జీవన్‌రెడ్డి: కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంది. చెరకు రైతులను ఆదుకోవడంతో పాటు మద్దతు ధర కల్పించేందుకే నిజాంషుగర్ ఫ్యాక్టరీలను తెరిపించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. క్యాబినెట్ సబ్ కమిటీని వేసింది. ఫ్యాక్టరీ బకాయిల కోసం 43 కోట్ల రూపాయలను విడుదల చేసింది. బీజేపీ నేతలు, కేంద్ర హోంమంత్రి సహకార రంగంలో ఈ కర్మాగారాలను తెరిపిస్తామని ప్రకటించారు. సహకార రంగంలో ఫ్యాక్టరీలను నడపడం ఇప్పుడున్న పరిస్థితుల్లో సాధ్యం కాదు. రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఈ ఫ్యాక్టరీలను తెరిపిస్తాం.

ఆంధ్రజ్యోతి: పార్లమెంట్ పరిధిలో గల్ఫ్ కార్మికులు ఎక్కువగా ఉన్నారు. ప్రతీ ఎన్నికల సమయంలో వారికి హామీలిస్తూ మర్చిపోతున్నారు. వారి కోసం ఏమి చేస్తారు?

జీవన్‌రెడ్డి: గల్ఫ్ కార్మికుల కుటుంబాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది. గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. గల్ఫ్‌లో మృతి చెందిన కుటుంబాలకు 5లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నాం. గల్ఫ్ కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు చర్యలను చేపడుతున్నాం. ఎంపీగా నన్ను గెలిపిస్తే జగిత్యాలలో కూడా పాస్‌పోర్టు కార్యాలయాన్ని ఏర్పాటు చేసే విధంగా చూస్తాం. జక్రాన్‌పల్లిలో ఎయిర్ పోర్టు ఏర్పాటుకు కృషి చేస్తాం. అవకాశం రాకుంటే డ్రైపోర్ట్ ఏర్పాటుకు పనిచేస్తాం.

ఆంధ్రజ్యోతి: నిజామాబాద్ కార్పొరేషన్‌గా ఎదిగినా.. కావాల్సినంత అభివృద్ధి జరగలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధిని కొనసాగిస్తారు?

జీవన్‌రెడ్డి: రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్ తర్వాత అతిపెద్ద కార్పొరేషన్ నిజామాబాద్. ఇది అభివృద్ధి చెందుతున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. పూర్తిస్థాయిలో మౌళిక వసతుల కల్పన చేయలేదు. డ్రైనేజీ నుంచి రోడ్ల వెడల్పు వరకు సమస్యలు ఉన్నాయి. వీటిని రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పరిష్కరించడంతో పాటు నిధులు వచ్చే విధంగా చూస్తాం. నిజామాబాద్ చుట్టూ రింగ్‌రోడ్ ఏర్పాటు చేసే విధంగా ప్రయత్నాలు చేస్తాం. బీజేపీ ఎంపీ ఐదేళ్లుగా అధికారంలో ఉన్నా.. స్మార్ట్ సిటీని తీసుకురాలేదు. ఎంపీగా గెలవగానే కేంద్రంలో ఒత్తిడి పెంచి స్మార్ట్ సిటీ అయ్యే విధంగా చూస్తాం.

ఆంధ్రజ్యోతి: పార్లమెంట్ పరిధిలో బీడీ కార్మికులు ఎక్కువగా ఉన్నారు. కొన్నేళ్లుగా వారికి ఉపాధి కూడా తగ్గిపోతోంది. చాలామంది కార్మికులకు పెన్షన్లు రావడం లేదు. వారి సమస్యలు ఎలా పరిష్కరిస్తారు.

జీవన్‌రెడ్డి: పార్లమెంట్ పరిధిలోనే కాకుండా మిగతా జిల్లాల్లో కూడా బీడీ కార్మికులు ఎక్కువగా ఉన్నారు. వారందరినీ ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది. కటాఫ్ డేట్‌ను తొలగించడంతో పాటు ప్రతీ బీడీ కార్మికురాలికి పెన్షన్ అందే విధంగా చూస్తాం. కేంద్రంలో ఏ ప్రభుత్వమైనా ఒత్తిడి తెచ్చి ఈఎస్ఐ ఆసుపత్రిని జగిత్యాలలో ఏర్పాటు చేసే విధంగా చూస్తాం.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటు వేసినా ఫలితం లేదు..

- మూడోసారి మళ్లీ మోదీనే మెజార్టీతో గెలిపించాలి
- ఎంపీగా అర్వింద్‌కు భారీ మెజార్టీని కట్టబెట్టాలి
- కార్నర్ మీటింగ్‌లో మాజీ గవర్నర్ తమిళసై సౌందర రాజన్


కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మాజీ గవర్నర్ తమిళసై


మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్

నిజామాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటు వేసినా ఫలితం లేదని, ఆ పార్టీలకు ప్రధానమంత్రి ఎవరవుతారో స్పష్టత లేదని రాష్ట్ర మాజీ గవర్నర్ తమిళసై సౌందర రాజన్ అన్నారు. గురువారం రాత్రి జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. దేశం సురక్షితంగా ఉండాలంటే మళ్లీ ప్రధానిగా మోదీ రావాలన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ధర్మపురి అర్వింద్‌ను రెండోసారి గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో భాగంగా పసుపు బోర్డును అర్వింద్ సాధించాడన్నారు. మళ్లీ గెలిపిస్తే నిజామాబాద్‌లో పసుపు బోర్డు కార్యాలయం ఏర్పాటు చేస్తాడన్నారు. ఆయనపై గత ఎన్నికల్లో పోటీ చేసిన కల్వకుంట్ల కవిత ఇప్పుడు జైల్లో ఉన్నారన్నారు. తప్పుడు పనులు చేస్తే ఎవరికైనా కేసులు తప్పవని ఆమె అన్నారు.

ఎన్నికల్లో ఆలోచించి.. నిర్ణయం తీసుకోవాలి: ఎంపీ

ఈ ఎన్నిక కీలకమైనదని.. ఓటు వేసే ప్రతి ఒక్కరూ ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నిజామాబాద్ సభలో తన హుందాతనం మరిచి మాట్లాడారన్నారు. మందిరాల పేరుతో బీజేపీ ఓట్లడుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి కూడా వాటికి అనుగుణంగానే మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. కార్నర్ మీటింగ్‌లో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆర్మూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్

కాంగ్రెస్, బీజేపీలు చేసింది శూన్యం

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

ఆర్మూర్‌రూరల్, మే 9: బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు మాయమాటలు చెప్పడం తప్ప.. ప్రజలకు చేసింది శూన్యమని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. గురువారం ఆర్మూర్ పట్టణంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డితో కలిసి రోడ్‌షో నిర్వహించారు. గతంలో మోదీ ఇస్తానన్న కుటుంబానికి రూ.15లక్షలు ఎక్కడ, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఎక్కడ అని ప్రశ్నించారు. ఎంపీగా గెలిస్తే గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు, కాల్ సెంటర్, పసుపుబోర్డు, ఏర్పాటు చేయిస్తానన్న ధర్మపురి అర్వింద్ ఇప్పటి వరకు ఏ ఒక్కటైనా చేశారా అని ప్రశ్నించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతు బంధు, రుణమాఫీ, తులం బంగారం, లాంటివి ఎన్నో హామీలు ఇచ్చి నెరవేర్చలేదన్నారు. తాను గతంలో ఆర్మూర్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రభుత్వంతో కొట్లాడి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేశానన్నారు. ఎంపీగా ఆశీర్వదించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేయిస్తానని బాజిరెడ్డి గోవర్ధన్ హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆర్మూర్ పట్టణంలోని అలూర్‌రోడ్డు నుంచి గోల్‌బంగ్లా వరకు పాదయాత్ర చేసి ప్రజలను కలుస్తూ కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని బాజిరెడ్డి గోవర్ధన్ అభ్యర్థించారు. కోరుట్ల, జగిత్యాల్, బాల్కొండలలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నందున బీఆర్ఎస్ పార్టీకి ఎంతో మద్దతు లభిస్తుందని, సర్వే అంచనాల ప్రకారం బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, జడ్పీటీసీ సంతోష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాజిరెడ్డికి మద్దతుగా కుటుంబ సభ్యుల ప్రచారం..


నాళేశ్వర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్ కుటుంబ సభ్యులు

నవీపేట: బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా మండలంలోని నాళేశ్వర్, బినోలలో గురువారం ఆయన కుటుంబ సభ్యులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాజిరెడ్డి గోవర్ధన్ సతీమణి వినోద, కోడలు దీపికలు జడ్పీ చైర్మన్ దాదన్న విఠల్ రావు, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమాలతో కలిసి ఈ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాబోయే ఎన్నికలలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని వారు ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నర్సింగ రావు, తెడ్డు పోశెట్టి, ప్రవీణ్ కుమార్, సురేష్, బెల్లాల్ నర్సింగ రావు, లక్ష్మణ్, ఆర్మూర్ శ్రీనివాస్, రాం కిషన్, మహేందర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



> పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ గడువు దగ్గర పడుతుండటంతో అభ్యర్థులు దూసుకుపోతున్నారు. ప్రచారానికి మరో రెండు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉండడంతో పార్టీలన్నీ ప్రచారపర్వానికి పదును పెడుతున్నాయి. అభ్యర్థుల సవాళ్లు.. ప్రతి సవాళ్లతో రాజకీయం వేడెక్కుతోంది. ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకొని పల్లెల్లో కొనసాగిస్తున్న ప్రచార సభలు హోరెత్తుతున్నాయి. దీంతో జిల్లాలో ఆసక్తికరంగా ఎన్నికల పోరు కనిపిస్తోంది. ఇప్పటికే జాతీయ, రాష్ట్ర స్థాయి నేతల పర్యటనలతో జిల్లాలో ప్రచారం ఊపందుకుంది.

- పోలింగ్ గడువు సమీపిస్తుండడంతో దూసుకుపోతున్న అభ్యర్థులు
- అగ్ర నేతల పర్యటనలతో జోరందుకున్న ప్రచారం
- జిల్లాలో రసవత్తరంగా మారుతున్న రాజకీయాలు

నిజామాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఇంకా ప్రచారానికి రెండు రోజులే గడువు ఉండటంతో సర్వశక్తులు ఒడ్డుతున్నారు. జాతీయ స్థాయి నేతలతో పాటు రాష్ట్రస్థాయి నేతలు కూడా ప్రచారాలకు వచ్చి వెళ్లడంతో చివరి ప్రయత్నాలను చేస్తున్నారు. బహిరంగ సభలన్నీ పూర్తి కావడంతో పార్లమెంట్ పరిధిలోని ఏడు సెగ్మెంట్లలో ర్యాలీలు, రోడ్‌షోలను అభ్యర్థులకు మద్దతుగా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇంచార్జిలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ప్రచారాలను నిర్వహిస్తున్నారు. ఓటర్లను తమ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా మూడు పార్టీల నేతలు పనిచేస్తుండగా మండల, నియోజకవర్గ స్థాయి నేతలు ప్రచారాలను కొనసాగిస్తున్నారు. రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లలో పాల్గొంటూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు

ప్రచారానికి రెండు రోజులే గడువు

పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి ఇంకా రెండు రోజులే గడువు ఉంది. ఈనెల 11న సాయంత్రం 5గంటల నుంచి ప్రచారాలు నిలిచిపోనున్నాయి. ఈనెల 13న పోలింగ్ జరుగనుంది. ఎర్రటి ఎండల నడుమ ప్రచారాలు నిర్వహించిన కాంగ్రెస్ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌లు పూర్తిస్థాయి సమయాన్ని ఈ ప్రచారాలకు వెచ్చిస్తున్నారు. ఖర్చుకు వెనకాడకుండా రోడ్‌షోలు, సమావేశాలను నిర్వహిస్తున్నారు. పోలింగ్ బూత్ కమిటీల ఇన్‌చార్జిలతో డోర్ టు డోర్ ప్రచారాలను కొనసాగిస్తున్నారు. సమయం దగ్గర పడుతుండటంతో ఇళ్లు ఇళ్లకు వెళ్లి కలిసే విధంగా చూడటంతో పాటు ఆయా బూత్ కమిటీలకు ప్రత్యేక ఇన్‌చార్జిలను నియమించి ప్రచారాలను కొనసాగిస్తున్నారు.

సీఎం మూడు దఫాలు ప్రచారంలో

కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా సీఎం మూడు దఫాలు ప్రచారంలో పాల్గొన్నారు. నామినేషన్ సందర్భంగా నిజామాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. అనంతరం కోరుట్లలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. రెండు రోజుల క్రితం ఆర్మూర్, నిజామాబాద్‌లో జరిగిన రోడ్‌షోలో సీఎం పాల్గొని జీవన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారాన్ని నిర్వహించారు. పార్లమెంట్ పరిధిలో నియోజకవర్గ ఇంచార్జి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారాలను కొనసాగిస్తున్నారు.

బాజిరెడ్డి గోవర్ధన్ సుడిగాలి పర్యటనలు


బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ పార్లమెంట్ పరిధిలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. నియోజకవర్గం అంతా కలియ తిరుగుతున్నారు. పార్టీ నేతల ఆధ్వర్యంలో అన్ని నియోజకవర్గాల్లో ప్రచారాలను కొనసాగిస్తున్నారు. ఆయనకు మద్దతుగా బాల్కొండ ఎమ్మెల్యే మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆధ్వర్యంలో ప్రచారాలను కొనసాగిస్తున్నారు. నియోజకవర్గాల్లో వీరు పూర్తిస్థాయిలో అభ్యర్థికి మద్దతుగా గెలుపు కోసం కృషి చేస్తున్నారు.

రెండున్నర నెలలుగా బీజేపీ అభ్యర్థి ప్రచారం

బీజేపీ అభ్యర్థి సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్ నియోజకవర్గాల్లో ముందస్తుగానే ప్రచారాన్ని మొదలు పెట్టారు. పార్టీ ముందుగానే అభ్యర్థిని ప్రకటించడంతో ఆయన గత రెండున్నర నెలలుగా పార్లమెంట్ పరిధిలో ప్రచారాలను చేస్తున్నారు. రెండో దఫా గెలిచేందుకు పూర్తిస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. అన్ని వర్గాల మద్దతును కూడగట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఆయనకు మద్దతుగా ప్రధాని నరేంద్రమోదీ రెండు నెలల క్రితమే జగిత్యాలలో జరిగిన భారీ బహిరంగ సభలో పాల్గొన్నారు. ఆయనకు మద్దతు ఇవ్వాలని కోరారు. రెండోదఫా గెలిపించాలని పిలుపునిచ్చారు. నామినేషన్ వేసే సమయంలో ఉత్తరఖాండ్ సీఎం పుష్కర్‌సింగ్ దామి హాజరయ్యారు. నిజామాబాద్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో పాల్గొన్నారు. బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. నాలుగు రోజుల క్రితం నిజామాబాద్ గిరిరాజ్ కళాశాలలో జరిగిన భారీ బహిరంగ సభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పాల్గొన్నారు. బీజేపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునివ్వడంతో పాటు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ప్రకటించారు.









రామా.. నీ భూములకు రక్షణేదీ?

- సుద్దులం, కోరట్ పల్లి గ్రామాల శివారులో ఇందల్వాయి రామాలయ భూములు
- 45 ఎకరాల్లో అక్రమంగా సాగు
- పట్టించుకోని దేవదాయ శాఖ అధికారులు
- ఆలయ భూములను రక్షించాలంటున్న భక్తులు

డిచ్‌పల్లి, మే9: అది 187 సంవత్సరాల క్రితం నిర్మించిన ఆలయం.. అప్పట్లో ఓ వెలుగు వెలిగిన ఆలయం నేడు అందవిహీనంగా మారింది. ఈ ఇందల్వాయి రామాలయం భూములు డిచ్‌పల్లి మండలంలోని సుద్దులం, కోరట్‌పల్లి, గ్రామాల శివారులో సుమారు 45 ఎకరాలకు పైగా భూములు ఉన్నాయి. కానీ దేవాలయ శాఖ ఈ భూములపై శ్రద్ధచూపని కారణంగా దేవుని మాన్యం కబ్జా కోరల్లో చిక్కుకుంది. శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని ప్రజాప్రతి నిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోకపోవడం తో ఆలయం కూలిపోయే దశకు చేరుకుంది. ఇప్పటికే కల్యాణ వేదిక, సత్రాలు, యజశాల, మండపాలు, కూలీపోయే దశకు చేరుకున్నాయి. గత 3ఏళ్ల క్రితం నాటి రాష్ట్ర దేవాలయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గ్రామస్థుల కోరిక మేరకు ఆలయం సందర్శించారు. ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని హామీఇచ్చినా ఇంతవరకు హామీ నేరవేర్చ లేదు.


సుద్దులం, కోరట్‌పల్లి శివారులోని ఆలయ భూముల్లో వరి సాగు చేస్తున్న దృశ్యం (ఫైల్)

ప్రభుత్వం సైతం మారిపోవడం ఆ విషయం కాస్త మూలనపడింది. గ్రామస్థులు, భక్తులు, అసహనం వ్యక్తంచేస్తున్నారు. కోట్లాది రూపాయలు విలువ చేసే భూములను తమ పేర పట్టాలు చేసుకునేందుకు కబ్జా రాయుళ్ల విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఈ భూములపై కోర్టులో న్యాయ పరిష్కారం కోసం దేవాలయ శాఖ అధికారులు కేసులు వేశారు. ప్రస్తుత స్థానిక ఎమ్మెల్యే ఈ భూముల విషయంలో స్పందించి భూములను అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, భక్తులు కోరుతున్నారు.








ఉపాధి కూలీల వద్ద ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

ఉపాధిహామీ పనుల వద్దే ఎన్నికల ప్రచారం

బాన్సువాడ టౌన్, మే 9: లోక్‌సభ ఎన్నికల వాతావరణం వేడెక్కింది. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ ఎంపీ అభ్యర్థులు, పార్టీల నాయకులు తమతమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. లోక్‌సభ ఎన్నికల వేళ ఎండతీవ్రత ఎక్కువగా ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళలో తమపార్టీ అభ్యర్థుల కోసం ప్రచారానికి పదును పెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం ఉపాధి హామీ పనులు కొనసాగుతుండడంతో ప్రధాన పార్టీల నాయకులు తమ అభ్యర్థి గెలుపు కోసం ఉపాధి కూలీల చెంతనే ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రస్తుత, గత ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ ప్రచారంలో దూసుకపోతున్నారు. తమ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని, అభివృద్ధి చేసి చూపిస్తామంటూ హామీలిస్తున్నారు. ఉపాధి కూలీలు వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి నీరు, కూల్‌డ్రింక్‌లను అందజేస్తున్నారు. అంతేకాకుండా ప్రస్తుత, గత ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ ప్రచారంలో దూసుకపోతున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో మూడు ప్రధాన పార్టీల మధ్యే పోటీ నెలకొందని చెప్పవచ్చు. బీఆర్ఎస్ నుంచి గాలి అనిల్‌కుమార్, బీజేపీ నుంచి బీబీ పాటిల్, కాంగ్రెస్ నుంచి సురేష్ షెట్కార్‌లు బరిలో ఉన్నారు. ఎంపీ అభ్యర్థులతో పాటు వివిధ పార్టీల ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జీలు తమ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తున్నారు.

రాజుల్లాలో ఉచిత వైద్యశిబిరం


ఉపాధి కూలీల వద్ద ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

బిచ్కుంద, మే 9: బిచ్కుంద మండలం రాజుల్లా గ్రామంలో రెడ్‌క్రాస్ సొసైటీ, ఎంఎంయూ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో రక్తపరీక్షలు, బీపీ,షుగర్, ఈసీజీ లాంటి దీర్ఘకాలిక వ్యాధుల నిర్ధారణ చేసి అవసరమైన మందులు అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఆరోగ్య సమన్వయకర్త డాక్టర్ విక్రమ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నిర్వహించే శిభిరాల్లో రాజుల్లా శిభిరం ఒకటి, జిల్లాలో ఇప్పటివరకు 37 శిబిరాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు సరైన సమయంలో నిజనిర్ధారణ చేసుకుని దీర్ఘకాలీక వ్యాధుల భారినపడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్‌పటేల్, జిల్లాకోశాధికారి దస్తిరాం, మద్నూర్ మండల చైర్మన్ ప్రకాష్, బిచ్కుంద మండల చైర్మన్ శివకుమార్, కోలావార్, వైస్‌చైర్మన్ శివకాంత్, ఐఆర్‌సీఎస్ రెండు మండలాల కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పదవి పదవే.. పని పనే..!

- పదవులు శాశ్వతం కాదంటున్న ఓ మహిళా ప్రజాప్రతినిధి

నిజాంసాగర్, మే9: ఒకప్పుడు ఆమె కూలీ.. ఆ పనులు చేసుకుంటూ జీవనం సాగించేది.. అవకాశం రావడంతో సర్పంచ్‌గా ఐదేండ్లు పదవి బా ధ్యతలు చేపట్టింది. తిరిగి సర్పంచ్ పదవి ముగిశాక కూలీ పనులకు వెళ్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. రాజకీయాల్లో పదవులు శాశ్వతం కాదని, పని పనేనని ఏ స్థాయికి ఎదిగినా ఎక్కడి నుంచి వచ్చామో మరిచిపోకూడదని తాజా మాజీ సర్పంచ్ గుర్తు చేస్తోంది. నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఐదేండ్లు పనిచేసింది. సర్పంచ్‌గా పనిచేసి పదవి అనంతరం కూలీ పనులు చేయడంతో గ్రామంలో అందరూ ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని సూచిస్తున్నారు. గ్రామాల్లో ఉపాధి పనులకు వెళుతూ పదవులు శాశ్వతం కాదని, పనులు చేసుకోవడంలో ఏ మాత్రం నామోషిగా భావించవద్దని చెప్తున్నారు. నేటి రోజుల్లో ఒక్కసారి పదవి చేపడితే తెల్లబట్టలు ధరించి, దుస్తులకు దుమ్ము అంటకుండా వెనుకాముందు మనం ఏంటో తెలుసుకోకుండా సమాజంలో నిలిచే ప్రతీ రాజకీయ నాయకులకు ఈ మాజీ సర్పంచ్ ఉపాధి పనులకు వెళుతుండటం పట్ల ఒక్క క్షణం ఆలోచనకు గురి చేస్తోంది.


ఉపాధి కూలీ పనిచేస్తున్న మాజీ సర్పంచ్

'రోడ్ షోను విజయవంతం చేయండి'

బాన్సువాడ టౌన్, మే9: బాన్సువాడ పట్టణంలో శుక్రవారం నిర్వహించే హిందువుల అభిమాన నాయకుడు, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రోడ్‌షోను విజయవంతం చేయాలని బాన్సువాడ బీజేపీ ఇన్‌చార్జి యెండెల లక్ష్మీనారాయణ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం రాత్రి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే రాజాసింగ్ ఉదయం బాన్సువాడకు విచ్చేసి తాడ్కోల్ రోడ్డు నుంచి రోడ్‌షోలో పాల్గొంటారని తెలిపారు. బాన్సువాడ నియోజకరవర్గంలోని ప్రజలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పార్లమెంట్ ప్రభారి పెద్దోళ్ల గంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, లక్ష్మీనారాయణ, హన్మాండ్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.


మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ఓట్లు కొల్లగొట్టడం ఎలా..!

● ప్రచార వ్యూహాల్లో ప్రధాన పార్టీలు ● ఎత్తులకు పై ఎత్తులతో ప్రచారం ● జహీరాబాద్ ఎంపీ సెగ్మెంట్ మహిళలు, ముస్లిం, లింగాయత్‌లే కీలకం

కామారెడ్డి,మే 9 (ఆంధ్రజ్యోతి): పల్లె పట్నం.. ఊరువాడ.. ఎన్నికల ప్రచారంలో హోరెత్తుతున్నాయి.ప్రచారానికి మరో మూడు రోజులు మాత్రమే ఉండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు వ్యూహాలకు పదును పెడుతున్నారు. జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల అభ్యర్థులు అంత ప్రచారంలో బీజీబీజీ అయ్యారు .ఓట్లను ఎలా రాబట్టాలి.. ఎన్ని ఓట్లు వస్తే గెలుస్తాం... ఏ వర్గం ఓట్లు ఎవరివైపు ఉన్నాయి అనే దానిపై అభ్యర్థులు వారి అనుచర వర్గాలు లెక్కలు వేస్తున్నారు.మరోవైపు ఓటర్లను ఆకర్షించేందుకు ఆయా పార్టీల మేనిఫేస్టోలను ప్రజలలోకి తీసుకువెళ్తుడడం, అగ్ర నేతలతో ప్రచారం నిర్వహిస్తు ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు.ఇలా అభ్యర్థులు గెలుపు పై శాయశక్తులా ఒడ్డుతూ ప్రచారం ముమ్మరం చేస్తున్నారు.



● వ్యూహాలకు పదును..

ఈ లోక్‌సభ ఎన్నికలు ప్రధాన పార్టీలు అయిన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు కీలకం కానున్నాయి. ఈ ఎన్నికల్లో గెలిచేందుకు ఓట్లు రాబట్టడం ఎలా అనే వ్యూహాలపై ప్రధాన పార్టీల అభ్యర్థులు పదును పెడుతున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ఉంది. ఈ ఎంపీ సెగ్మెంట్‌లో కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని మొత్తం ఓట్లు 16,40,755 ఉన్నాయి. ఇందులో పురుషుల 8,01,563 ఉండగా మహిళల ఓట్లు 8,39,133ఉన్నాయి. పోలింగ్ సమయం దగ్గర పడుతుండడంతో ఓట్లు రాబట్టడం ఎలా అనే అంశంపైనే ప్రధాన పార్టీలు దృష్టిసారిస్తున్నాయి.సామాజికవర్గాలు,యువత,మహిళలు,వృద్ధులు కేటగిరిల వారిగా ఏ వర్గం ఓటుబ్యాంక్ ఎంత,అగ్ర వర్గాలు, బీసీ,ఎస్సీ, ఎస్టీ,మైనారిటి వర్గాల ఓట్లు ఏఏ అసెంబ్లీ నియోజకవర్గాలలో ఏ మెరకు ఉన్నాయి.ఉద్యోగులు,నిరుద్యోగులు,యువతను ఆకర్షించడం ఎలా, ఈ ఎన్నికలలో ఏ వర్గం ఓట్లు ఏ నియోజకవర్గంలో ఏ మేరకు ప్రభావితం చూపుతాయి? అంటూ రాజకీయ పార్టీలు ప్రస్తుతం ఓటుబ్యాంక్ లెక్కల్లో పడ్డాయి.ప్రభుత్వ సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన వారి ఓట్లు తమకే పడతాయనే ధీమాతో అధికార కాంగ్రెస్,బీజేపీలు ఉండగా దీని గమనించిన బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ మద్దతు ఓట్లలో చీలిక తెచ్చే వ్యూహలతో ప్రచారం చేస్తున్నారు. మరో వైపు కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. బీజేపీ కేంద్రంలో ప్రవేశ పెట్టిన పథకాలను, మోడి చరిష్మను విస్తృత ప్రచారం చేస్తూ ప్రజల ముందుకు పోతున్నారు. ఇలా ప్రచారంలో సైతం ప్రధాన పార్టీలు ఓటుబ్యాంక్ లక్ష్యంగా ఎత్తులకు పై ఎత్తులు వేస్తుండడం సామాజికవర్గాల వారీగా ప్రసంగాలు చేస్తున్నారు.

● మహిళా ఓట్లే అధికం

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో పరిధిలో పురుషులకంటే మహిళా ఓట్లే అధికంగా ఉన్నాయి.ఈ పార్లమెంట్ నియోజకవర్గాల్లోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ మహిళా ఓట్లే అధికంగా ఉండటం గమనార్హం. ఈ ఎంపీ సెగ్మెట్‌లో మొత్తం ఓట్లు 16,40,755 ఓట్లు ఉండగా ఇందులో సగానికి పైగా అంటే 8,39,133 మహిళా ఓట్లే ఉన్నాయి. పురుషుల కంటే మహిళల ఓట్లు 38 వేలకు పైగా ఉన్నాయి.జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోనే అత్యధికంగా 1,37,866 మహిళల ఓట్లు ఉన్నాయి. కామారెడ్డిలో 1,32,301,ఆందోళ్‌లో 1,28,186,నారాయణఖేడ్‌లో 1,18,373, ఎల్లారెడ్డిలో 1,16,131,జుక్కల్‌లో 1,03,286,బాన్సువాడలో 1,02,990 మహిళా ఓటర్లు ఉన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో మహిళ ఓట్లు కీలకం కాను న్నందున ప్రధాన పార్టీలు మహిళల ఓట్లపై దృష్టి సారించారు. వారి ఓట్లను ఆకర్షించేందుకు మహిళలకు హమీల వర్షాలు కురిపిస్తున్నారు.

● కుల సంఘాల ఓట్లకు గాలం

పోలింగ్ సమయం దగ్గర పడుతున్న కొద్ది కుల సంఘాల ఓట్లకు ప్రధాన పార్టీల అభ్యర్థులు గాలం వేస్తున్నారు. ఏ వర్గం ఓట్లు సాధిస్తే గెలవచ్చనే ఆలోచనలో అభ్యర్థులు వ్యూహాలు రచిస్తున్నారు. జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో లింగాయత్, ముస్లింల,మున్నూరుకాపు ఓట్లే కీలకం కానున్నాయి. దాదాపు 16 లక్షల ఓటర్లలో లింగాయత్‌ల ఓట్లు 2.56 లక్షలు ఉన్నాయి. లింగాయత్‌లు ఎక్కువగా జహీరాబాద్, నారాయణఖేడ్, జుక్కల్ అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉన్నారు. ముస్లింల ఓట్ల సంఖ్య 2.30 లక్షలు ఉన్నాయి. వీరంతా జహీరాబాద్, కామారెడ్డి, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్నారు. మున్నూరుకాపుల ఓట్లు సుమారు 2లక్షల వరకు ఉన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ ప్రతి ఎన్నికల్లోను వీరి ఓట్లే కీలకమవుతూ వస్తున్నాయి. ప్రతి లోక్‌సభ ఎన్నికలోను మహిళ ఓట్లతో పాటు లింగాయత్, ముస్లింల,మున్నూరుకాపు ఓట్లే అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయిస్తున్నాయి. జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి మూడు పర్యాయలుగా ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో నియోజకవర్గ ఓటర్లు ఒకసారి కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వగా.. రెండుసార్లు బీఆర్ఎస్ అభ్యర్థికి అవకాశం ఇచ్చారు. తాజాగా జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు హోరాహోరిగా తలపడుతున్నాయి. జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో మెజార్టీ ఓట్లు ఉన్న వర్గాల వారు తమవైపు అంటే తమవైపే ఉన్నారంటూ ప్రధాన పార్టీల అభ్యర్థులు చెప్పుకొస్తున్నారు. మరోవైపు వారి ఓట్లను కొల్లగొట్టేందుకు కుల సంఘాల వారీగా తాయిలాలను ప్రకటిస్తున్నారు. గెలిచిన తర్వాత ఆ వర్గాలకు భారీ మొత్తంలో నిధులు ఇప్పిస్తామంటూ హామీలు ఇస్తున్నారు.

● ప్రధాన పార్టీల మధ్యే పోటీ

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్,బీఆర్ఎస్,బీజేపీ ప్రధాన పార్టీల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఈ ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ఆయా పార్టీల మేనిఫెస్టో, అభివృద్ధి, సంక్షేమ పథకాలపైనే ఆశలు పెట్టుకుంటున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలను ప్రకటించింది. ఈ మేనిఫేస్టోలను కాంగ్రెస్ అభ్యర్థులు, నేతలు ప్రచారంలో భాగంగా ప్రజలలోకి తీసుకెళ్తుండగా.. బీఆర్ఎస్ పార్టీ గతంలో అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూనే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ చేపట్టిన అభివృద్ధి పనులను సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రచారం చేపడుతున్నారు. సోషల్ మీడియా ద్వారా కరపత్రాలు,వాల్‌పోస్టర్‌లు,ప్రచార వాహనాల ద్వారా ఉరువాడలో ప్రజలకు తెలియజేస్తున్నారు. పార్టీల అభ్యర్థులు సైతం పోటాపోటీగా పట్టణాలు, పల్లెల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు.

జక్రాన్‌పల్లిలో పోలింగ్ బూత్‌ల పరిశీలన

జక్రాన్‌పల్లి, మే9: మండలంలోని అన్ని గ్రామాలలో పోలింగ్ బూత్‌లను గురువారం అధికారులు పరిశీలించారు. తహసీల్దార్ కిరణ్మయి. ఎంపీడీవో సతీష్‌కుమార్, వివిధ శాఖల అధికారులు గ్రామాలలో పర్యటించి పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఎన్నికల అధికారులకు సౌకర్యాలు ఉన్నాయా లేవా అడిగితెలుసుకున్నారు. సౌకర్యాలు లేని చోట సౌకర్యాలు కల్పించాలని స్థానిక అధికారులకు సూచించారు. ఈనెల 13న ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చే ఓటర్లకు బూత్‌ల వద్ద అన్ని ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

'రాజ్యాంగాన్ని మార్చే హక్కు ఎవరికీ లేదు'



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘాల నాయకులు

గాంధారి,మే 9: భారతరాజ్యాంగాన్ని మార్చేహక్కు ఎవరికి లేదని బీసీ సంఘం నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. బీజేపీ 400 ఎంపీసీట్లు గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తామనడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ప్రపంచంలోనే భారతదేశ రాజ్యాంగానికి ఉన్న విలువ మరే దేశానికి లేదని అన్నారు. ఇలాంటి రాజ్యాంగాన్ని మారుస్తామనడం సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వం వెంటనే బీసీ కులగణన చేసి హక్కులనుకాపాడాలని సూచించారు.బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ,బీసీలకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. ప్రజలు,యువకులు గమనించి ఓట్లు వేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు మాజీ ఎంపీపీ మదుసూధన్‌రావు, డీసీసీబీ జిల్లా డైరెక్టర్ సాయికుమార్, మాజీ సర్పంచ్ సంజీవ్, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగారాం, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన్నంగా లచ్చన్ ఎస్సీ కాలనీ



ఇంటి ముందు మురికి కాల్వ నిండిన దృశ్యం

మద్నూర్,మే 9: గ్రామ పంచాయతీ అధికారుల తీరు అస్తవ్యస్థంగా ఉంది. లచ్చన్‌లోని ఎస్సీ కాలనీలో పరిస్థితి చూస్తే నిర్లక్ష్యం కనిపిస్తోంది. మురికి కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో నీళ్లు నిలబడుతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు బాధ్యతలు అప్పగించినా మురికి కాల్వలు శుభ్రం చేయించడం లేదని ఆరోపిస్తున్నారు. దళితులు నివాసం ఉండే ఇళ్ల ముందు మురికినీరు ఉండటంతో దోమల బెడద తీవ్రం అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి దళిత కాలనీపై చిన్నచూపు చూడకుండా శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

బాజిరెడ్డి గెలుపు కోసం తనయుడి ప్రచారం



ఉపాధి హామీ పనులు చేస్తూ కూలీలను ఓట్లు అభ్యర్థిస్తున్న బాజిరెడ్డి జగన్

జక్రాన్‌పల్లి, మే9: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన తనయుడు, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ ప్రచారం చేశారు. గురువారం మండలంలోని అర్గుల్ గ్రా మంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి బీఆర్ఎస్ ఎంపీ గా బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.అలాగే వివిధ గ్రామాలలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ కుంచాల విమల రాజు, వైస్ఎంపీపీ తిరుపతిరెడ్డి, జడ్పీటీసీ తనుజా శ్రీనివాస్ రెడ్డి,మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బోజన్న, మండల కోఆప్షన్ సభ్యు డు అక్బర్ ఖాన్, బీఆర్ఎస్ నాయకులు ప్రదీప్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల పుణ్యమా.. అని చేతి నిండా పని

మద్నూర్, మే 9: ఐదు ఏళ్లకు ఒక్కసారి వచ్చే ఎలక్షన్ల పండుగ కళాకారులు, చిరు వ్యాపారస్తులకు లాభాల పంట పండిస్తోంది. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్ర్య అభ్యర్థులు ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహిస్తుండటంతో ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి. అయినా అభ్యర్థులు ప్రత్యర్థులను ఢీ కొట్టేందుకు సై అంటే సై అంటున్నారు. ఇన్నాళ్లు స్థబ్దుగా ఉన్న వ్యాపారాలు ఎన్నికల పుణ్యమా అని జోరందుకున్నాయి. బహిరంగ సభలు, ర్యాలీలు, గ్రామాల్లో ప్రచారాలు, వీడియోలు, ఫొటో కెమెరాల్లో చిత్రీకరించి, వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాంగాంలలో పోస్టు చేస్తున్నారు. దీంతో వీడియో, ఫొటోగ్రాఫర్లకు ఉపాధి లభిస్తోంది. ప్రచార పర్వం ముగిసే వరకు ఒక్కొక్కరికి రూ.30 వేల నుంచి రూ. 50 వేలుగా ఉంది. ద్వితీయ శ్రేణి నాయకులు, అభ్యర్థి వెంట తిరిగే అనుచర గణానికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం వంటకాలు చేసే వారికి గంప గుత్తాగా మాట్లాడుకుని పసందైన వంటలు చేస్తున్నారు. క్యాటరింగ్, సర్వీస్ బాయ్స్, టెంట్ హౌజ్‌లకు డిమాండ్ పెరిగింది. అంతేకాకుండా రాజకీయ నాయకుల నిలువెత్తు ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవడం సర్వసాధారణమైంది. మేనిఫేస్టో వివరాలు, హామీలు, తదితర వాటిని కరపత్రాలు, ఫ్లెక్సీల రూపంలో ఏర్పాటు చేస్తున్నారు.

ప్రైవేట్ వాహనాలకు డిమాండ్

ప్రతీ మండలానికి మూడు, నాలుగు ప్రచార రథాలు, ప్రైవేట్ వాహనాలను అద్దెకు తీసుకుని నడిపిస్తున్నారు. కూలీలకు డిమాండ్ పెరిగింది. ఎన్నికలంటే ప్రధానంగా జనసమీకరణ అందుకోసం పోలింగ్‌కు ముందే ర్యాలీల ద్వారా ప్రదర్శించేందుకు కూలీలను ముందే మాట్లాడుకున్నట్లు సమాచారం. రోజుకు రూ. 300 కూలీతో పాటు మధ్యాహ్న భోజనం కల్పిస్తున్నారు. ఏది ఏమైనా ఎన్నికల పుణ్యమా అంటూ కొంతమేర ఉపాధి లభిస్తుంది.

మట్కారాయుళ్ల అరెస్టు

ఎడపల్లి, మే 9: ఎడపల్లి మండల కేంద్రంలో మట్కా అడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎడపల్లి మండల కేంద్రంలోని ఓ బార్బర్ షాపులో మట్కా ఆడుతన్నట్లు పక్కా సమాచారం మేరకు దాడి చేసి ఐరండ్ల గంగాధర్, ఇర్ఫాన్ అనే వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్దనుండి మట్కా చిట్టీలను, రెండు సెల్ ఫోన్లు, 1510 రూపాలయలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కల్తీ మద్యం పట్టివేత


సుభాష్‌నగర్,మే 9: మద్యాన్ని కల్తీ చేస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. నగరంలోని నిఖిల్‌సాయి ముందర గల పరమేశ్వరి వైన్స్‌లో మద్యాన్ని కల్తీ చేస్తున్నారన్న పక్కా సమాచారంతో స్టేట్ ఎక్సైజ్ టాస్కఫోర్స్ సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించగా హైయ్యర్ బ్రాండ్‌లో చీప్ లిక్కర్ కలిపినట్లు గుర్తించారు. 37 ఫుల్ బాటిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో నిజామాబాద్ ఎస్‌హెచ్‌వో దిలీప్, ఎస్సైలు మల్లేష్, సుశ్మిత, సింధు, సిబ్బంది ధర్‌సింగ్, మోహన్‌సింగ్, సంజయ్, తదితరులు పాల్గొన్నారు.



కల్తీ మద్యం పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

నిజామాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తా

● కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి



రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, మే 9: నిజామాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి నోచుకోలేదని కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతుందని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం నిజామాబాద్ రైల్వేస్టేషన్‌ను ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశవేణుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీగా గెలుపొందిన తర్వాత నిజామాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రైల్వే లైన్ డబ్లింగ్ చేస్తే ప్రయాణికులకు సౌకర్యాలు ఏర్పడుతాయని నిజామాబాద్ రైల్వే జంక్షన్‌ను అభివృద్ధి చేయాలన్నారు. ఆర్మూర్ నుంచి ఆదిలాబాద్, బోధన్ నుంచి బీదర్ వరకు రైల్వేలైన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అంతకుముందు ఆయన నగరంలోని పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. లక్ష్మి కల్యాణ మండపంలో నిర్వహించిన గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనం, శ్రద్ధానంద్‌గంజ్‌లో కార్మికుల ఆత్మీయ సమ్మేళనం, వైశ్రాయ్ గార్డెన్‌లో వెలమ ఆత్మీయ సమ్మేళనంలో జీవన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయనతో పాటు మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ విప్ అనిల్, గడుగు గంగాధర్, కేశవేణు తదితరులు పాల్గొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న జీవన్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్ అబద్ధాల పుట్ట : అర్వింద్



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్

ఆర్మూర్‌రూరల్, మే9: కాంగ్రెస్ పార్టీ అబద్దాల పుట్ట అని, వారికి అవకాశం ఇస్తే దేశాన్ని అమ్మేస్తారని నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. గురువారం ఆర్మూర్ లోని అంబేద్కర్‌చౌరస్తాలో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డితో కలిసి ఆయన కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ.. దేశానికి, ధర్మానికి సంబంధించిన ఎన్నికలు అని ప్రతీ ఒక్కరు నరేంద్రమోదీని గెలిపించాలన్నారు. డ్వాక్రా మహిళలకు ఐదు శాతం వడ్డీ రాయితీని కేంద్రం అందజేస్తుందని, ఐదేళ్ల వరకు ఉచిత రేషన్, ఆయుష్మాన్ భరత్‌ద్వారా రూ.5లక్షల ఆరోగ్యబీమాను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. గత, ఇప్పటి పాలకులు కనీసం రేషన్‌కార్డులు ఇవ్వడంలేదని మండిపడ్డారు. రేషన్‌కార్డులు ఉన్నప్పుడే అర్హులందరికి పథకాలు అందుతాయన్నారు. హిందువులు బిచ్చగాళ్ల అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం పట్ల అర్వింద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నీ సంస్కారం అలాంటిది, నీ మాటలు నీ విజ్ఞతకే వదిలేస్తున్నామని అర్వింద్ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతు బీమా, రుణమాఫీ, రూ.500బోనస్, రూ.4వేల పింఛన్ హామీలు ఎక్కడ అమలు చేశారన్నారు. నిషేధిత ఉగ్రవాద సంస్థలు కాంగ్రెస్ మద్దతు ఇస్తున్నాయని ప్రజలు గమనించాలన్నారు. గత పదేళ్ళ కాలంలో దేశంలో ఒక్క అవినీతి కూడా జరగకుండా పాలన సాగిందని అర్వింద్ తెలిపారు. పసుపుబోర్డుపై కూడా రాజకీయాలు చేస్తున్నారని విమర్శిం చారు. ఈనెల 13వ తేదీన ప్రతీఒక్కరు తప్పనిసరిగా పోలింగ్ కేంద్రానికి వెళ్ళి ఓటు వేసి బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌ను భారీ మెజారిటీతో గెలిపిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పల్లె గంగారెడ్డి, కోటపాటి నర్సింహనాయుడు, జీవీ.నర్సింహరెడ్డి, కంచెట్టి గంగాధర్, ద్యాగ ఉదయ్, కలిగోట గంగాధర్, జెస్సు అనిల్, రోహిత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వర ఆలయంలో ద్వాదశ వార్షికోత్సవాలు

● ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు ● మహాకుంభాభిషేక కార్యక్రమానికి హాజరుకానున్న హంపీ విరుపాక్ష విద్యారణ్య భారతిస్వామి

డిచ్‌పల్లి, మే 9: మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో గల శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి దేవాలయ సముదాయంలో 12న వార్షికోత్సవం పురస్కరించుకొని ఈ నెల 10నుంచి 14వ తేదీ వరకు ఆలయ ప్రాంగణంలో ద్వాదశ వార్షికోత్సవ కార్యక్రమాలు నిర్వహిసున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ రావుల బ్రహ్మానందం తెలిపారు. ఈ కార్యక్రమానికి హంపి విరూపాక్ష విద్యారణ్యభారతి మహస్వామి మహాకుంభాభిషేక కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరువుతున్నట్లు ఆయన తెలిపారు. క్రోధి నామ సంవత్సరం వైశాఖ శుక్ల పక్షమి అభిషేకాలు, శ్రీదేవి భూదేవి వెంకటేశ్వర స్వామి కళషాలతో కుంభాభిషేకం వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమానికి బ్రహ్మ శ్రీ వేలేటి పుశుపతి శర్మ, బ్రహ్మశ్రీ ఉమామహేశ్వర శర్మ, ఆధ్వర్యంలో వేడుకలు జరుగుతాయని భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకావలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భక్తులకు ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నమన్నారు. వేడుకలను పురష్కరించుకొని ఆలయం చుట్టూ రంగు రంగుల విద్యుత్ దీపాలను అలంకరించారు.



విద్యుత్ దీపాలతో ఆలయం ముస్తాబు

'హక్కుల కోసం పనిచేసే వారిని గెలిపించాలి'

సిరికొండ మే 9 : ఈ నెల మతోన్మాద బీజేపీ దాని మిత్ర పక్షాల పార్టీల అభ్యర్థులను ఓడించి, ప్రజాస్వామిక లౌకిక ప్రజాతంత్ర హక్కుల కోసం పనిచేసే వారిని పార్లమెంటు ఎన్నికల్లో గెలిపించుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు ప్రభాకర్ ప్రజలను కోరారు. సిరికొండ మండలం గడ్కోల్ గ్రామంలో గురువారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పదేళ్లుగా దేశ ప్రజలను నిలువున దోపిడి చేసిందన్నారు.వివిధ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అమ్మేసిందన్నారు.దేశ ప్రజలు కోరుతున్న కుల గణన చేపట్టడంలో నరేంద్రమోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని ఆయన విమర్శించారు. 2014లో పెట్రోలు ధర రూ.65లు ఉండగా డీజిల్ ధర రూ.52లు ఉండేది, వంట గ్యాస్ ధర రూ.410లు ఉండేదన్నారు. నరేదంరమోదీ ప్రభుత్వం ధరలు తగ్గిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోలు 110,డీజిల్ 100, వంటగ్యాస్ ధర 1100లకు పెంచి ప్రజలను నిలువ దోపిడీ చేసిందన్నారు. దేశంలో మనువాదాన్ని ప్రోత్సాహిస్తూ సమాజాన్ని కులాలు, మతాలుగా విడదీసి ప్రజల మధ్య వైషమ్యాలను పెంచుతుందని ఆయన మండిపడ్డారు అందుకని ఈ నెల 13న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో మతోన్మాద బీజేపీ దాని మిత్ర పక్ష పార్టీల అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని, ప్రజాస్వామిక, లౌకిక పార్టీల అభ్యర్థులను గెలిపించి దేశాన్ని మతోన్మాదులన నుంచి కాపాడుకోవాలని ప్రభాకర్ ప్రజలను కోరారు. ఈ సమావేశంలో రామకృష్ణ, దేవరాం, రమేష్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

పడిలేచిన మర్రిచెట్టు ఆలయానికి రూ.లక్ష విరాళం

ముప్కాల్, మే9 ముప్కాల్ మండల కేంద్రంలోని పడిలేచిన మర్రిచెట్టు దేవస్థానం కమిటీకి రూ.లక్ష విరాళాన్ని గురువారం సావెల్ గ్రామానికి మనోహర్ అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మనోహర్ దంపతులను సన్మానించారు. ఆలయ అభివృద్ధికి తోడ్పతానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ఈదురు గాలులతో వర్షం



డొంకేశ్వర్‌లో ఈదురుగాలులతో కురుస్తున్న వర్షం

డొంకేశ్వర్, మే9: డొంకేశ్వర్ మండలం నడ్కుడ, గాదేపల్లి, చిన్నయానం, అన్నారం, సిర్పూర్ డొంకేశ్వర్ గ్రామాలలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గురువారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా అకాశం చల్లబడింది ఈదురుగాలులు మొదలయ్యాయి. సుమారు 40నిమిషాల పాటు వర్షం కురియడంతో ఒక్కసారిగా ప్రజలు ఎండ వేడికి అవస్థ పడుతున్న ప్రజలకు కాస్త చల్లదనం లభించింది.

నగరంలో వివాహిత ఆత్మహత్య

ఖిల్లా, మే 9 : భర్త పెట్టె వేధింపులు తాళలేక ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం ఉదయం నగరంలోని ఐదవ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని నాగారం 300క్వార్టర్స్ ప్రాంతంలో వెలుగులోకి వచ్చింది. నగరానికి చెందిన చెన్నూరు కావేరి(30)ఆత్మహత్య చేసుకుంది. భర్త సంతోష్ మద్యానికి బానిసై రోజు మద్యం సేవించి వచ్చి భార్యతో వాగ్వాదానికి దిగేవాడని ఐదవటౌన్ ఎస్ఐ అశోక్ తెలిపారు. భర్త పెట్టె వేధింపులు తాళలేక కావేరి ఆత్మహత్యకు పాల్పడింది. వీరికి 2006లో వివాహం జరుగగా 14ఏళ్ల కూతురు ఉంది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పిడుగు పడి రెండు ఆవులు మృతి



పిడుగు పడి రెండు ఆవులు మృతి చెందిన దృశ్యం

మోపాల్, మే 9: మండలంలోని శ్రీరాంనగర్ తాండా గ్రామ పంచాయతీ పరిధిలోని ఉన్యానాయక్ తండాలో బుధవారం అర్ధరాత్రి పిడుగు పడి రాథోడ్ శ్రీనుకు చెందిన రెండు ఆవులు మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. నిత్యం పొలం వద్ద ఉన్న ఆవులు ఇంటికి తిరిగి రాకపోవడంతో గురువారం ఉదయం అక్కడికి వెళ్లి చూసేసరికి మృతి చెంది పడి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆవులు మృతి చెందడంతో లక్షా 20వేల రూపాయలు ఆస్తినష్టం జరిగిందని తెలిపారు. అధికారులు తనకు న్యాయం చేయాలని కోరారు

ఎన్నికల్లో ప్రలోభాలను నివారించేందుకు గట్టి నిఘా

● ఇంటిలిజెన్స్ కమిటీ సమావేశంలో పరిశీలకులు ● రెట్టింపు సంఖ్యలో నిఘా బృందాల ఏర్పాటు



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు



హాజరైన అధికారులు

నిజామాబాద్ అర్బన్, మే 9: ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికలు పూర్తి పారదర్శకంగా ఎలాంటి ప్రలోభాలాకు అవకాశం లేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సంబంధిత విభాగాల అధికారులు, ఇంటిలీజెన్స్ బృందాలు గట్టి నిఘాను కొనసాగిస్తూ అంకితభావంతో పనిచేయాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలీస్ వజ్ అర్, వ్యయ పరిశీలకులు డీఎం నెమ్లీలు సూచించారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు నేతృత్వంలో జరిగిన ఇంటిలీజెన్స్ కమిటీ సమావేశంలో పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ ఓటర్లను ప్రలోభాలాకు గురిచేసే డబ్బు, మద్యం విలువైన వస్తువులు, ఇతర కానుకలు, మత్తు పదార్థాల తదితర వాటిపై గట్టి నిఘా ఉంచాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వలెన్స్, స్టాటిస్టికల్ సర్వలెన్స్, వీడియో వీవింగ్ బృందాలు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. అనుమానాస్పద ఆన్‌లైన్ బ్యాంకు లావాదేవీలను నిశితంగా పరిశీలించాలని అధిక మొత్తంలో నగదు బదిలీ జరిగే ఖాతాలను గుర్తించాలని లీడ్‌బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రావును ఆదేశించారు. అక్రమ మద్యం నిల్వలు, మద్యం రవాణాపై దాడులు నిర్వహించాలని, ఐఎంఎల్ డిపో నుంచి దిగుమతి చేసుకుంటున్న మద్యం నిల్వలు ఎక్కడైనా పక్కదారి పడుతున్నాయా అని నిఘా ఉంచాలని ఎక్సైజ్ అధికారులను సూచించారు. పోలింగ్‌కు సమయం సమీపిస్తున్నందున మరింత అప్రమత్తతతో పకడ్బందీగా విధులు నిర్వహించాలని నిఘా బృందాలకు సూచించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ ఆబ్కారి, రవాణా, వాణిజ్య పన్నుల తదితర శాఖల సిబ్బందితో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారని ప్రతి వాహనాన్ని తనిఖీలు చేయాలన్నారు. అలాగే ప్రస్తుతం పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో 21 ఎఫ్‌ఎస్‌టీ బృందాలు నిఘా కొనసాగిస్తున్నాయని వాటి సంఖ్యను రెట్టింపు చేస్తామని వాటిని 30కి పెంచుతున్నామన్నారు. ఆర్టీసీ బస్సులో కార్గో సేవల ద్వారా, రైల్వే మార్గం ద్వారా ఏమైనా వస్తువులను ఎన్నికల్లో ప్రలోభాల కోసం పంపిస్తున్నారా అనే అనుమానం కలిగితే వెంటనే అధికారులకు సమాచారం అందించాలన్నారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి విస్తృత తనిఖీలు చేస్తూ పలు చోట్ల నగదుతో పాటు మద్యాన్ని పట్టుకున్నామని ఆయా శాఖల అధికారులు సమన్వయంతో సమిష్టిగా కృషి చేస్తూ అక్రమ నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ వంటి ప్రలోభాలాకు అడ్డుకట్ట వేసేలా గట్టి నిఘా కొనసాగిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● పోలింగ్ సందర్భంగా ప్రచార కార్యక్రమాలు నిషేధం

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పురస్కరించుకొని ఎన్నికల సంఘం నియమావళిని అనుసరిస్తూ నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈనెల 11న సాయంత్రం 6గంటల నుంచి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమల్లోకి వస్తుందని ఎన్నికలు ముగిసే వరకు జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని రిటర్నింగ్ అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో జిల్లాయేతర వ్యక్తులు ఎవరు కూడా జిల్లాలో ఉండకూడదని ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ, ఎంసీటీ, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండి కళ్యాణమండపాలు, లాడ్జీలు, హోటళ్లలో తనిఖీలు చేయాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సెక్షన్ 126(1) (బి) ఆర్‌పియాక్ట్ 1951 ప్రకారం ఒపినియన్ పోల్, ఎగ్జిట్ పోల్స్ నిషేధమని ఆయన స్పష్టం చేశారు. ఈనెల 11న సాయంత్రం 6గంటల నుంచి ఎన్నికలు ముగిసే వరకు జిల్లాలో మద్యం షాపులను మూసివేయాలని ఆయన ఆదేశించారు.

● పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవు

ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించిందని పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13 సోమవారం అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు, పరిశ్రమలకు వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించారని ఆయన తెలిపారు.

● ఎంసీఎంసీ అనుమతి లేకుండా ఎన్నికల ప్రచార ప్రకటనలు చేయరాదు

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ అనుమతి లేకుండా పోలింగ్ రోజున, అలాగే పోలింగ్‌కు ముందు రోజున అనగా ఈనెల 12, 13 తేదీల్లో ప్రింట్ మీడియాలో ఎలాంటి ఎన్నికల ప్రచార ప్రకటనలు ప్రచురించకూడదని కలెక్టర్ తెలిపారు. వివిధ రాజకీయ పక్షాలు, అభ్యర్థులు, ఇతరులు ఎవరైనా ముందస్తు అనుమతి కోసం దరఖాస్తు చేసుకొని ధృవీకరణ పొందాలని లేనిపక్షంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం తనకు ఉన్న అధికారాలను వినియోగిస్తూ తగు చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈనెల 12, 13 తేదీల్లో ప్రింట్ మీడియాలో ఎన్నికల ప్రచార ప్రకటనలు ప్రచురితం చేయదల్చిన వారు తప్పనిసరిగా అనుమతులు పొందాలన్నారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే రీతిలో ఆవేశపూరితమైన, తప్పుదోవ పట్టించే, ద్వేషపూరిత ప్రకటనలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబడవన్నారు.

● బల్క్ ఎస్ఎంఎస్‌లు నిషేధం

పోలింగ్‌కు 48 గంటల నిశబ్ద వ్యవధి అమల్లో ఉంటుందని కావున ఈనెల 11 సాయంత్రం 6గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 6గంటల వరకు ఎలాంటి అభ్యంతరకరమైన, రాజకీయపరమైన అంశాలతో కూడిన సంక్షిప్త సందేశాలు, బల్క్ ఎస్ఎంఎస్‌లపై ఎన్నికల సంఘం నిషేదం విధించడం జరిగిందని దీన్ని దృష్టిలో పెట్టుకొని ఎస్ఎంఎస్‌లు పంపకూడదని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక మాధ్యమంలో వచ్చే బల్క్ ఎస్ఎంఎస్‌లను నిశితంగా పర్యవేక్షించడం జరుగుతుందని సైలెన్స్ పిరియడ్‌లో నిషేధ ఉత్తర్వును ఉల్లంఘిస్తూ ఎవరైనా అభ్యంతరకరమైన బల్క్ ఎస్ఎంఎస్‌లు పంపినట్లయితే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలి

● జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్



బోధన్ ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

బోధన్‌రూరల్,మే9: పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని విజయ మేరి పాఠశాలలో ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. అనంతరం సాలూర మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరగడానికి ప్రతీ ఒక్కరు సహకరించాలని పేర్కొన్నారు. ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత కోసం భారీ బందోబస్తును ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట బోధన్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, తహసీల్దార్ గంగాధర్, రెవెన్యూ ఇన్స్‌స్పెక్టర్ వరుణ్, బూత్ అధికారులు, గ్రామ పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: మండలంలోని సాటాపూర్ పోలింగ్ కేంద్రాన్ని గురువారం అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని తహసీల్దార్ కలీంకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల భవనాలను పరిశీలించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరిగిందని, స్థానిక అధకారులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండిపర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ కలీం, ఎంపీవో గౌస్, పంచాయతీ కార్యదర్శి మహబూబ్ తదితరులున్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి



నూత్‌పల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎలక్షన్ అబ్జర్వర్

డొంకేశ్వర్, మే9: పోలింగ్ కేంద్రాలలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎలక్షన్ జనరల్ అబ్జర్వర్ అలైజ్‌వజర్ ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గురువారం డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ రోజుకేంద్రాలలో తాగునీరు వసతి, టెంటు,మరుగుదొడ్లు,ఫ్యాన్లు, దివ్యాంగుల కోసం ర్యాంపులు సరిగ్గా ఉన్నాయా అని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఆమె పరిశీలించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు. ఆమె వెంట తహసీల్దార్ వెంకటరమణ, ఆర్ఐ రాజేశ్వర్, సర్వేయర్ కిషన్, జూనియర్ అసిస్టెంట్ సాయన్న, తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న తహసీల్దార్

మోపాల్,మే 9: ఈనెల13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలోభాగంగా మండలంలో ఉన్న పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రామేశ్వర్ గురువారం ఉదయం పరిశీలించారు. పోలింగ్ బూత్ వద్ద ఓటర్లకుఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్థాయి అధికారులకు ఆదేశించారు.తహసీల్దార్ మండలంలోని న్యాల్‌కల్, సిర్పూర్, ముదక్‌పల్లి, బాడ్సి, మం చిప్ప, తదితర గ్రామాల్లో ఉన్న పో లింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద నీటి వసతి కల్పించడంతో పాటు వికలాంగులకు వీల్‌చైర్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రం వద్ద అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి అధికారులు ఉన్నారు.

సెల్‌ఫోన్లు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్‌లు

ఖిల్లా, మే 9: నగరంలోని ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కారణాలతో పోగొట్టుకున్న సుమారు రూ.7లక్షల విలువచేసే 37 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు.సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించినట్లు తెలిపారు. సెల్‌ఫోన్‌లను గురువారం బాధితులకు అప్పగించినట్లు వివరించారు.

ఆర్టీసీ బకాయిలు చెల్లించాలని జీవన్‌రెడ్డి మాల్‌కు నోటీసులు



ఆర్టీసీ బకాయిలు చెల్లించాలని అనౌన్స్‌మెంట్ చేస్తున్న ఆర్టీసీ అధికారులు

ఆర్మూర్‌టౌన్, మే9: పట్టణంలోని మాజీఎమ్మెల్యే జీవన్ రెడ్డి మాల్‌కు ఆర్టీసీ అధికారులు బకాయిలు చెల్లించాలని గురువారం నోటీసులు జారీ చేశారు.హైకోర్టు ఆదేశాల మేరకు ఇప్పటి వరకు ఉన్న రూ.3కోట్ల 14లక్షల బకా యిలు చెల్లించాలని లేని ఎడల కాంప్లెక్స్ స్వాధీనం చేసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా బకాయిలు చెల్లించకుంటే మాల్‌ను సీజ్ చేసి స్వాధీనం చేసుకుంటామని మైక్‌లో అనౌన్స్‌మెంట్ చేసుకుంటూ మాల్ మొత్తం అధికారులు కలియతిరిగారు. అనంతరం విశ్వజిత్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్‌కు నోటీసులు అందజేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో కరీంనగర్ విజిలెన్స్ ఆఫీసర్ బాబు రావు, ఆర్టీసీ డీప్యూటీ ఆర్ఎం శంకర్, డిపో మేనేజర్ ఆం జనేయులు, ఎస్సైలు ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.20 లక్షల ఎస్‌బీఐ ప్రమాదబీమా అందజేత



మృతుడి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మేనేజర్ రాము

ఏర్గట్ల, మే 9: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో ఖాతాదారుడైన ఉప్లూర్ గ్రామానికి చెందిన డాకూరి చక్రవర్తి అనే వ్యక్తి ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఏర్గట్ల ఎస్‌బీఐ బ్రాంచ్‌లో పీఏఐ ఇన్సురెన్స్ చేయించుకోగా గురువారం అట్టి 20 లక్షల ప్రమాదబీమా చెక్కును మృతుడి భార్య డాకూరి లతకు బ్రాంచ్ మేనేజర్ రాము అందజేశారు.భవిష్యత్తు గురించి ఆలోచించుకొని భీమాలు చేయించుకోవాలని ఆయన తెలిపారు.ఈకార్యక్రమంలో సర్వీస్ మేనేజర్‌ఎమ్ ధర్మ పురి, ఏరియా బిడీఎమ్ శ్రీధర్,బ్రాంచ్ సిబ్బంది పాల్గొ న్నారు.

15న డిచ్‌పల్లి మండల సర్వసభ్య సమావేశం

డిచ్‌పల్లి, మే 9: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 15న ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జరగనుందని, ఈ సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలని,అధికారులందరు 2024 ఏప్రిల్ మాసం వరకు ప్రగతి నివేదికలు అందజేయాలని ఎంపీడీవో రవీందర్, ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో తాగునీటి సమస్యలపై, ప్రత్యేక చర్య ఉంటయన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

రెంజల్,మే9: మండలంలోని కళ్యాపూర్, కూనేపల్లి రోడ్డు వైపు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు బుధవారం అర్ధరాత్రి సమయంలో రెంజల్ ఎస్ఐ సాయన్న సిబ్బందితో కలిసి ఇసుక టిప్పర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న కందకుర్తి గ్రామానికి చెందిన రావుస్ అనే వ్యక్తి టిప్పర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసి తహసీల్దార్‌కు అప్పగించడం జరిగిందని ఎస్ఐ సాయన్న తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

● మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి



కోటగిరిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి

కోటగిరి,మే9: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. కోటగిరి ఉమ్మడి మండలంలోని కొడిచర్ల, కోటగిరి గ్రామాలలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఉపాధి కూలీ రూ.400 చేస్తామన్నారు. బోధన్, బీదర్ రైల్వే లైన్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రైల్వే లైన్ ఏర్పాటుతో ఈ ప్రాంతం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఎన్నికల కోసం దేవుడి పేరుతో రాజకీయం చేస్తున్న బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షహీద్, శంకర్, సునీల్ కుమార్, కిషోర్, గంగాధర్ దేశాయ్, తదితరులు పాల్గొన్నారు.

ముదక్‌పల్లిలో చోరీ



ధ్వంసమైన బీరువా

మోపాల్, మే 9: మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముదక్‌పల్లిలో తాళం వేసి ఉంచిన ఇంటికి గుర్తుతెలియని దొంగలు తాళం పగలగొట్టి బీరువా ధ్వంసం చేసి అందులో ఉన్న తులం బంగారం, 40వేల నగదును ఎత్తుకెళ్లారని బాధితురాలు కావ్య గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత కొన్ని రోజుల క్రితం కావ్య ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. గురువారం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం, బీరువాను ధ్వంసం చేసి ఉన్నట్లు పోలీసులకు ఆమె వివరించింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.

పోతంగల్‌లో మొరం ట్రాలీ బోల్తా



పొతంగల్‌లో బోల్తా పడిన మొరం ట్రాలీని పైకి లేపుతున్న దృశ్యం

నవీపేట,మే9: పొతంగల్‌లోగురువారం మొరం తరలిస్తున్న ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. గ్రామంలో అనుమతులు లేకుండా ట్రాక్టర్‌లలో మొరం తరలిస్తుండగా గ్రామంలోని ప్రధాన రోడ్డు మూల మలుపు వద్ద మొరం లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ట్రాలీ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలుకాలేదు. వెంటనే స్థానికులు మరో ట్రాక్టర్ సహాయంతో ట్రాలీని పైకి లేపారు. ఈ విషయంపై తహసీల్దార్ నారాయణను వివరణ కోరగా పొతంగల్‌లో అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్నారన్న విషయం తమ దృష్టికి వచ్చిందని వెంటనే మొరం తరలింపును నిలిపివేయడంజరిగిందనిఆయనపేర్కొన్నారు.అనుమతులు లేకుండా మొరంతవ్వకాలు చేపడితే చర్యలని హెచ్చరించారు.

బోధన్‌లో ఒకరి ఆత్మహత్య

బోధన్‌రూరల్,మే9: బోధన్ పట్టణంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన అశోక్ (32)అనే వ్యక్తి గురువారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్ పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారు



దూస్‌గాంలో మాట్లాడుతున్న జిల్లా సీపీఐ (ఎంఎల్) నాయకులు

డిచ్‌పల్లి, మే 9: దేశ వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించి దేశ ప్రజలను రోడ్డుమీదకు తెచ్చిన ఆర్ఎస్ఎస్, బీజేపీ పార్టీలను ఈఎన్నికల్లో ఓడించాలని ఇండియాకూటమి అభ్యర్థులను ఓట్లువేసి గెలిపించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు వేల్పూరి భూమయ్య అన్నారు. గురువారం మండలంలోని దూస్‌గాంలో ఉపాధికూలీలను కలిసిన ఆయన ఓటర్లను ఉద్దేశించి మాట్లాడారు. ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేస్తున్నారని కనీస వేతన కూలీ చెల్లించడం లేదన్నారు. మోదీ రైతుల పంట భూములను ఆదానీ అంబానీలకు కట్టబెట్టారని ఆయన ఆరోపించారు. 44చట్టాలను 4లెబర్ కోడ్లను ఉపాధిని దెబ్బతీశారని ప్రజల మీద రాముని పేరుతో చిచ్చు పెడుతూ రాజకీయం చేస్తున్నరని ఆర్ఎస్ఎస్ బీజేపీ పార్టీలను చిత్తుగా ఓడించాల న్నారు. ఈకార్యక్రమంలో నాయకులు జేపీగంగాధర్,భారతి,స్వామి, పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు మెరుగు పర్చాలి

డిచ్‌పల్లి, మే 9: ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేయాడానికి వచ్చే వారికి కావాల్సిన సౌకర్యాలను మెరుగు పర్చాల్సిన అవసరం గ్రామస్థాయి అధికారులపై ఉందని ఎంపీడీవో రవీందర్ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల నిర్వహణ తీరుతెన్నులను ఆయా గ్రామాల ప్రజల పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించి పనులు సకాలంలో అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటు వేసేందుకు వచ్చే దివ్యాంగులకు 3చక్రాల సైకిళ్లను అందుబాటులో ఉంచాలని, పోలింగ్ కేంద్రాలు వెలుతురు ఉండేందుకు విద్యుత్ సరఫరాకు మెరుగుపర్చలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయలన్నారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd Bodhan branch, agreed to accord loan to Borrower : GONDLA RAVI S/O GONDLA NADIPI GANGARAM Aged 34 Years OCC: Business R/o H.No.1-182/18 Baswapur Village Kotagiri Mandal Nizamabad Dist Property Holder : GONDLA RAVI S/O GONDLA NADIPI GANGARAM Aged 34 Years OCC: Business R/o H.No.1-182/18 Baswapur Village Kotagiri Mandal Nizamabad Dist by mortgage of the schedule property mentioned below. The above prospective loanee agreed to create first charge against property mentioned below in favour of my client company. if any person having any title, claim, or objection of what so ever nature may put forth their claims before me within 7 days of this notice. The objection raised afterwards shall be deemed to be "Waived" and not binding on my client company and my client shall proceed further for according above loan.

Schedule

The Existing House of Open Place Bearing G.P.No.1/182A12 Area of admeasuring 212.33 Sq yards Situated Baswapur Village Kotagiri Mandal Nizamabad Dist The Under the Jurisdiction of Registration Dist Nizamabad Sub Dist Bodhan.

Bounded as follow.

East: G.P.Road, **West:** House of Gondla Laxmaiah, **North:** House of Laxmi Sukhdev giri, **South:** Water canal

K. SUBBA RAO, B.sc. LLB
Advocate, Bodhan, Ph:9440004201

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd Bodhan branch, agreed to accord loan to Borrower : ADEPU MEENA KUMARI W/O GUNDE MAHESH Aged 32 Years OCC: Business R/o. 6-47/1 Nehru Nagar Village, Yedapally Mandal, Nizamabad Dist Property holder : GUNDE RAJAIAH S/O POCHAIYYA Aged 58 Years OCC: Business R/o H.No.6-47/1, Nehru Nagar Village, Yedapally Mandal, Nizamabad Dist by mortgage of the schedule property mentioned below. The above prospective loanee agreed to create first charge against property mentioned below in favour of my client company. If any person having any title, claim, or objection of what so ever nature may put forth their claims before me within 7 days of this notice. The objection raised afterwards shall be deemed to be "Waived" and not binding on my client company and my client shall proceed further for according above loan.

Schedule

The Existing R.C.C & Z.S.Roofed House Bearing G.P.No. 6-47 Area of admeasuring 111.61 Sq yards or R.C.C.Plinth Area 305.91 Sq feets or Z.S.R.Plinth Area 342.00 Sq feet Situated Nehru Nagar Village Yedapally Mandal Nizamabad Dist The Under the Jurisdiction of Registration Dist Nizamabad Sub Dist Bodhan

Bounded as follow.

East: Sairy then House of Jafar, **West:** 5'0' G.P.Road, **North:** G.P. Road, **South:** House of Khaleel

K. SUBBA RAO, B.sc. LLB
Advocate, Bodhan, Ph:9440004201

చికెన్ ధరలు





రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.275	రూ. 295

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72,200	రూ.66,600	రూ.845

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఆ ఒక్కటి అడక్కు (1.35, 7.45)
: టిల్లు స్క్వేర్ (4.30)
: బాక్ (10.40)
స్క్రీన్-2 : ద పాల్ గాయ్ (ఇంగ్లీష్) (11.00, 1.50, 7.20, 10.10)
: గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (4.40)
స్క్రీన్-3 : ప్రసన్నవదనం (1.10, 4.15, 10.10)
: శబరి (7.20)
స్క్రీన్-4 : ప్రసన్నవదనం (1.10, 7.20)
: మంజుమ్మల్ బాయ్స్ (4.20, 10.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1: ప్రతినిధి-2 (10.45, 430, 10.30)
: కృష్ణమ్మ (1.35, 7.30)
స్క్రీన్-2 : బ్రహ్మచారి (10.50)
: ఆ ఒక్కటి అడక్కు (1.40)
: బాక్ (4.30)
: ఆరంభం (7.30)
: కృష్ణమ్మ (10.30)
స్క్రీన్-3 : కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (ఇంగ్లీష్) (10.50, 7.35)
: కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (తెలుగు) (1.45, 4.40, 10.30)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15)
: ఆ ఒక్కటి అడక్కు (6.15, 9.15)
లలితమహల్ : ప్రతినిధి-2 (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్: కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (తెలుగు) (11.15, 2.15, 6.15 9.15)
విజయ్ : కృష్ణమ్మ (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్